క్లుప్తంగా

అమర వీరులకు నివాళి



గుడివాడ టౌన్: పుల్వామా దాడిలో మృతి చెందిన అమర వీరులకు ప్రతిఒక్కరూ నివాళులర్పించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక చౌదరిపేటలోని శిరీష ఫౌండేషన్ కార్యాలయంలో పుల్వామా అమర వీరుల సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామ సరిహద్దు గుర్తింపు

ముదినేపల్లి రూరల్: చినకామనపూడిలో రీ సర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. రీ సర్వే పనులను తహసీల్దార్ జేఎస్ సుభానీ శుక్రవారం పరిశీలించారు. గ్రామ సరిహద్దు పాయింట్ల గుర్తింపు, గ్రామ ట్రై జంక్షన్, ప్రభుత్వ భూముల పాయింట్లను తహసీల్దార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీ సర్వే వల్ల రైతుల మధ్య వివాదాలకు తావుండదని తెలిపారు. ఇందుకు సంబంధించి తగిన ఆధారాలతో రైతులు రెవెన్యూ సిబ్బందిని సంప్రదించి రీ సర్వే ప్రక్రియకు సహకరించాలని తహసీల్దార్ కోరారు.

పట్టణ పరిశుభ్రతలో భాగస్వాములవుదాం



గుడివాడ టౌన్: గుడివాడ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలనే సంకల్పంతో ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో 10కే రన్ నిర్వహిస్తున్నామని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 16వ తేదీ ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహించే 10కే రన్ కాన్సెప్టును లెట్ అజ్ రన్ ఫర్ క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడ నినాదంతో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రీడాకారులతో పాటు పట్టణ ప్రజలు కూడా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సంయుక్త కార్యదర్శి కె.రంగప్రసాద్, కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి. వంశీకృష్ణ, వి. వరప్రసాద్, ఎ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు

కైకలూరు: పలు రకాల నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ అన్నారు. సీసీ కెమెరాల ఉపయోగాల గురించి స్థానిక షాపుల యజమానులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాలు వ్యాపారులు, ఆర్థిక స్థోమత ఉన్నవారు ఏర్పాటు చేసుకుంటే నేరాలు అరికట్టవచ్చన్నారు. ఈ కెమెరాల ఏర్పాటును పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నట్టు చెప్పారు. పట్టణాన్ని సురక్షితంగా, నేర రహిత పట్టణంగా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రేమసాయి ఆటో ఫైనాన్స్ యజమాని శశిశేఖర్, రాజు సహకారంతో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పౌష్టికాహారంతో జీవిత కాలం పెంపు



గుడివాడ టౌన్: హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారం తీసుకుంటూ అందరితో కలిసి ఉంటే ఎక్కువకాలం జీవించవచ్చునని చైల్డ్ ఫండ్ ఇండియా క్లస్టర్ ప్రాజెక్ట్ మేనేజర్ మధుసూదనరావు అన్నారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏపీ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ కృష్ణాజిల్లా విభాగం, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఆర్టీ మందులు సక్రమంగా వాడుతూ మంచి ఆహారాన్ని తీసుకుంటూ జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. ప్రాజెక్ట్ కౌన్సిలర్లు విజయ, మౌనిక, రీసోర్స్‌పర్సన్ సువర్ణరాజు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి, జోనల్ సూపర్‌వైజర్ బి.రాకేష్, దేవి పాల్గొన్నారు.

ఆర్ఎంపీలకు శాశ్వత గుర్తింపు కార్డుల పంపిణీ

కైకలూరు: గ్రామీణ వైద్యులు ఎముకులు, నరాల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని భీమవరం ఇంపీరియల్ హాస్పిటల్ వైద్యులు నరేష్‌కుమార్ సూచించారు. కైకలూరు కార్తీక్ మినీ ఫంక్షన్ హాల్లో గ్రామీణ వైద్యుల ఏరియా సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఏరియా అధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డాక్టర్ నరేష్ ఎముకులు, నరాల వ్యాధులను ముందుగా గుర్తించడంపై అవగాహన కల్పించారు. గ్రామీణ వైద్యుల అధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరాజు, రాంబాబు మాట్లాడుతూ అసోసియేషన్ తరపున ఆర్ఎంపీలకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశామన్నారు. జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన తాగునీటి ప్రాజెక్టు

- 24 ఏళ్ల క్రితం నిర్మించిన పథకం
- తాగునీటి చెరువుల్లో చేపల పెంపకం
- శిథిలావస్థకు చేరిన ఓహెచ్‌బీఆర్ ట్యాంకు
- దెబ్బతిన్న భూగర్భ పైప్‌లైన్లు

కైకలూరు: కొల్లేరు గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉన్నత లక్ష్యంతో నిర్మించిన పెంచికలమర్రు పంచాయతీరాజ్ గ్రామీణ నీటి సరఫరా ప్రాజెక్టు విభాగానికి చెందిన సమగ్ర రక్షిత నీటి సరఫరా పథకం అటకెక్కింది. కొల్లేటికోటతో పాటు మరో 17 ఇతర నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరాకు 2000 డిసెంబరు 23న అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు పథకం ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో శివారు నియోజకవర్గం కావడంతో ప్రకాశం బ్యారేజీ నీరు ఇక్కడి తాగునీటి పథకానికి చేరకపోవడంతో నిర్లక్ష్యానికి గురైంది.



పెంచికలమర్రు పథకం వద్ద మూలకు చేరిన మైక్రో వాటర్ ఫిల్టర్



నీటి సరఫరా ఓవర్ హెడ్ ట్యాంకు (ఇన్‌సెట్లో) శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు

ట్యాంకు కెపాసిటీ 1,20,000 లీటర్లు

పెంచికలమర్రు ఓవర్ హెడ్ ట్యాంకు కెపాసిటీ 1,20,000 లీటర్లు. నీటి సరఫరా నిమిత్తం పథకం దగ్గరలో 60 ఎకరాల విస్తీర్ణం కలిగిన మూడు తాగునీటి చెరువులు ఉన్నాయి. కృష్ణా బ్యారేజ్ నుంచి పోల్‌రాజ్ కాలువ ద్వారా చెరువుల్లోకి నీటిని మళ్లించే ఏర్పాట్లు చేశారు. రానురాను నీటి సరఫరా తగ్గింది. దీంతో నీటి సరఫరా పథకం పనితీరు అరకొరగా మారింది. ఇక్కడ మైక్రో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసిన స్వచ్ఛమైన నీరు రాకపోవడంతో అది తుప్పు పట్టి మూలన పడింది. పలుమార్లు మరమ్మతులు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పెంచికలమర్రు తాగునీటి చెరువుల్లో చేపల పెంపకం చేస్తున్నారు. మూడు సంపుల్లో ఒకటి మాత్రమే పని చేస్తుంది. మిగిలిన రెండింటిలో నాచుపట్టి ఉంది.

రూ.3 కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం

కొల్లేరు గ్రామాలు శృంగవరప్పాడు, గుమ్మళ్లపాడు, పందిరిపల్లిగూడెం, పెంచికలమర్రు, ఆలపాడు, పల్లెవాడ పంచాయతీలతోపాటు మరో 10 ఆవాస ప్రాంతాలకు నీటిని సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన పెంచికలమర్రు స్కీంకు నీటి సరఫరా తగ్గింది. దీంతో 2014 చివరిలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పశ్చిమగోదావరి జిల్లా సిద్ధాంతం నుంచి గోదావరి నీటిని తరలించడానికి రూ.కోటి 50 లక్షలు కేటాయించారు. తర్వాత 2018లో అప్పటి ఎన్డీఏ పాలనలోని కూటమిలో భాగంగా ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ మరో రూ.కోటి 50 లక్షలు అనుమతులు తెచ్చారు. దీంతో సిద్ధాపురం, కొట్టాడ మీదుగా పెంచికలమర్రు స్కీం వరకు గోదావరి నీరు వస్తుంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు చేరడానికి భూగర్భ పైపులైను పాడైంది. దీంతో నేరుగా స్కీం సంపులోలకి చేరిన గోదావరి నీటిని పెంచికలమర్రు, ఆలపాడుకు మాత్రమే అందించగలుగుతున్నారు.

నీటికి కటకట

కొల్లేరు ప్రాంతంలో ఆక్వా చెరువుల కారణంగా భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. కొన్ని గ్రామాల్లో మైక్రో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేసినా అవి త్వరగా పాడవుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు నుంచి తాగునీటిని ట్యాంకులతో తీసుకొచ్చి క్యాన్ రూ.25 నుంచి రూ.30 విక్రయిస్తున్నారు. కొల్లేరు గ్రామాల్లో తాగునీటి చెరువులు ఏర్పాటు చేసినా కేవలం వాడుకోడానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. పెంచికలమర్రు నీటి పథకంలో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన పైపులైను పూర్తిగా దెబ్బతింది.



పథకం వద్ద పసర్లతో సంపు

నీటి పథకాన్ని అందుబాటులోకి తేవాలి



గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు భయపడుతున్నారు. అనేక గ్రామాల్లో పైపులైను తుప్పుపట్టి పాడయ్యాయి. నీటి పథకం వద్ద ఏర్పాటు చేసిన మైక్రో వాటర్ ఫిల్టర్ కెపాసిటీ తగినంతగా లేకపోవడంతో శుద్ధి చేసే క్రమంలో త్వరగా పాడవుతుంది. నీటి సరఫరా పథకాన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి.

– జయమంగళ కాసులు, సర్పంచ్, పెంచికలమర్రు

వాటర్ గ్రిడ్‌తో శాశ్వత పరిష్కారం



పెంచికలమర్రు గ్రామీణ నీటి సరఫరా ప్రాజెక్టును వాటర్ గ్రిడ్ పథకంలో చేర్చాం. ప్రకాశం బ్యారేజీ నుంచి పైపుల ద్వారా నీటిని తీసుకొచ్చి శుద్ధి చేసిన జలాలను నేరుగా సంపుల్లో చేరుతాయి. కాలువల ద్వారా నీటిని తరలించే ఏర్పాటు ఉండదు. వాటర్ గ్రిడ్ 2028లో పూర్తవుతుంది. పెంచికలమర్రు పథకం వద్ద 2012–14 ఏడాదిలో నిర్మించిన పైపులైన్లు పాడయ్యాయి. సిద్ధాపురం నుంచి గోదావరి నీటిని పెంచికలమర్రు, ఆలపాడు సరఫరా చేస్తున్నాం.

–వి.శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, కైకలూరు

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: స్థానిక సబ్‌స్టేషన్ లోని 33 కేవీ కండక్టర్ ఆధునికీకరణ, సాంకేతిక మరమ్మతులు కారణంగా ఆదివారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముదినేపల్లి మండలంలో నేడు

ముదినేపల్లి రూరల్: చిగురుకోట, సింగరాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుడివాడ డీఈ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడవచ్చని పేర్కొన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గృహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

పన్ను వసూలు చేయండి

గుడివాడ టౌన్: పట్టణంలో ఆస్తి, నీటిపన్ను బకాయిల వసూళ్లపై శ్రద్ధ పెట్టాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ పి. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో పన్ను బకాయిలు పేరుకు పోయాయన్నారు. తొలుత ఇంటింటికీ వెళ్లి రిమాండ్ నోటీసులు అందజేయాలన్నారు. దీనికి స్పందించని వారిపై చర్యలు ఉంటాయని సూచించాలన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కైకలూరు: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మండవల్లి మండలం తక్కెళ్లపాడు, కైకలూరు మండలం పెంచికలమర్రు, కలిదిండి మండలం తాడినాడ సీడబ్ల్యూసీ స్కీంలను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. పెంచికలమర్రు స్కీం వద్ద గ్రామస్తులు సీఈఓతో మాట్లాడారు. 24 ఏళ్ల క్రితం నిర్మించిన రక్షణ నీటి సరఫరా పథకం శిథిలావస్థకు చేరిందన్నారు. దీనిని పూర్తిగా పడగొట్టి నూతనంగా నిర్మించాలని కోరారు. ఆయన పథకానికి సంబంధించిన తాగునీటి చెరువులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వి.శ్రీనివాసరావు, ఏఈలు కృష్ణారావు, నాగబాబు, పంచాయతీ సెక్రటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గుడివాడ విద్యార్థి



గుడివాడలో చెజ్ అస్టీన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుడివాడ టౌన్: జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు గుడివాడ ఆంధ్ర నలంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం స్రవంతి తెలిపారు. శుక్రవారం పాఠశాల్లో జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థి దేశభక్తుల చెజ్‌అస్టీన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ పాఠశాల్లో 10వ తరగతి చదువుతున్న చెజ్‌అస్టీన్ ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా తరపున పాల్గొని తన ప్రతిభను ప్రదర్శించారన్నారు. ఆ పోటీల్లో విజయం సాధించిన చెజ్‌అస్టీన్ ఏప్రిల్లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఆమె వివరించారు. ఈ మేరకు తమకు సమాచారం వచ్చిందన్నారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడం తమ పాఠశాలకు గర్వకారణం అన్నారు. ఉపాధ్యాయులు పీవీ సత్యనారాయణ, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు విద్యార్థుల ప్రతిభ

పామర్రు: అవనిగడ్డలో జరిగిన గ్రిగ్ మెమోరియల్ సెంట్రల్‌జోన్ ఆటల పోటీల్లో పామర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఏ ఇందిరాణి పేర్కొన్నారు. స్థానిక కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్లో విజేతలను శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 11,12,13 తేదీల్లో జరిగిన ఈ పోటీల్లో డిస్కస్ త్రో లో శాన్వి సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. టీ సర్మిక డిస్కస్‌త్రోలో బ్రాంజ్ మెడల్ గెలుపొందినట్లు పేర్కొన్నారు. దేవి విశాలక్ష్మి జావలెన్ త్రో లో బ్రాంజ్ మెడల్ సాధించారన్నారు. బాలుర సెంట్రల్ జోన్ గోగినేనిపాలెంలో జరిగింది. అండర్–14 బాలుర విభాగంలో సాఫ్ట్ బాల్ రన్నర్స్‌గా నిలిచారని తెలిపారు.



విజేతలతో హెచ్‌ఎం ఇందిరారాణి



కప్ అందుకుంటున్న పీడీ, క్రీడాకారులు

బాల్ బ్యాడ్మింటన్‌లో ప్రథమస్థానం

కాజ(మొవ్వ): కృష్ణా జిల్లా సెంట్రల్ జోన్ పోటీల్లో బాలికల విభాగం బాల్ బ్యాడ్మింటన్ పోటీలో మొవ్వ మండలం కాజ శ్రీ పేకేటి నరసారెడ్డి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం టీవీ రమణ శుక్రవారం విలేకరులకు తెలిపారు. అవనిగడ్డ ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు వెల్లడించారు.

టాయిలెట్లను అందుబాటులోకి తీసుకురావాలి

పామర్రు: నిరుపయోగంగా ఉన్న సామాజిక టాయిలెట్లను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీఓ జ్యోతి ఆదేశించారు. స్థానిక సచివాలయం–1 వద్ద స్వచ్ఛ భారత్ పథకంలో భాగంగా మరుగుదొడ్ల సముదాయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ నిధులు రూ.3.50 లక్షలతో నిర్మించిన సామాజిక మరుగుదొడ్ల సముదాయం పనులు 90శాతం వరకు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన పది శాతం పనులను కూడా సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రత్నారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత పాటించాలి



పామర్రు: చికెన్ దుకాణాల వద్ద పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ జ్యోతి పేర్కొన్నారు. మండలంలోని పలు చికెన్ దుకాణాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వ్యాధి సోకి కోళ్లు మృతి చెందుతున్నాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా బయట ప్రాంతాల నుంచి కోళ్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. గ్రామ కార్యదర్శి సలీం, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్ తదితరులు పల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులపై శ్రద్ధ చూపండి



గుడివాడలో శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న సీడీపీఓ

గుడివాడ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆహారం, విద్య పై శ్రద్ధ చూపాలని సీడీపీఓ విజయా ఫ్లారెన్స్ అన్నారు. స్థానిక ఏజీకే మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పోషణాభి–పడానాభి అనే అంశంపై అంగన్‌వాడీ కార్యకర్తల్లో అవగాహన పెంచాలని ఆదేశించిందన్నారు. చిన్నారుల్లో శక్తిని పెంపొందించడానికి తీసుకోవాల్సిన ఆహార పద్ధతులు, ఆహారం, వారికి అర్థమయ్యేలా విద్యాభ్యాసం ఎలా చేయాలని అనే అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు. సూపర్‌వైజర్‌లు నాగజ్యోతి, ఎ. జయంతి తదితరులు పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల హైస్కూల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన సమావేశం నిర్వహించారు. వెంట్రప్రగడ, పెదపారుపూడి సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎం. శివనాగమణి, అరుణ మాట్లాడుతూ చిన్న పిల్లలలో వచ్చే సూక్ష్మపోషకాల లోపాలను గుర్తించాలన్నారు. నివారణ చర్యలను వివరించారు.

నందివాడలో..

నందివాడ: మహిళా శిశు సంక్షేమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని గుడివాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయ్‌ఫ్లోరెన్స్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో అంగనవాడీ కార్యకర్తలకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భవాని, నాగ శిరీష, కార్యకర్తలు పాల్గొన్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: తాడంకి జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగనవాడీ కార్యకర్తలకు పోషణ్ భీ–పడాయి భీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి పిల్లలో జరిగే శారీరక, మానసిక అభివృద్ధిపై అవగాహన కల్పించారు. పిల్లలు పుట్టిన నాటి నుంచి వారిని గమనిస్తూ ఉన్నత స్థాయిలో ఎదగడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఉషా, అనిత, ఝాన్సీ పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



పమిడిముక్కల: మంటాడలో ఆధునికీకరించిన గీతామందిరంలో శనివారం శ్రీ విఘ్నేశ్వర, ఆంజనేయ, సాయిబాబా, నాగదేవత విగ్రహ ప్రతిష్టా మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ కార్యదర్శి పులి సాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురు, శుక్ర వారాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యావికాస్ వ్యవస్థాపక డైరెక్టర్ సుబ్బారావు మృతి



గుడివాడ టౌన్: విద్యావికాస్ విద్యాసంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ ముప్పాళ్ల సుబ్బారావు(71) శుక్రవారం మృతిచెందారు. విద్యావ్యవస్థను ఏర్పాటు చేసి పట్టణంలోనే ప్రముఖ పాఠశాలగా తీర్చిదిద్దిన సుబ్బారావు మృతిపట్ల పలువురు పట్టణ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఆయన అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

రైతులందరూ కచ్చితంగా గుర్తింపు సంఖ్య పొందాలి

పమిడిముక్కల: రైతులంతా కచ్చితంగా అగ్రి స్టాక్ పోర్టల్ ద్వారా విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి గ్రామ వ్యవసాయ సహాయకులకు సూచించారు. కపిలేశ్వరపురం రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించి, విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలించారు. త్వరితగతిన రైతులందరికీ గుర్తింపు సంఖ్య నమోదు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గన్నవరం వ్యవసాయ సహాయకులు సునీల్, మండల వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెయ్యేరులో ...

ముదినేపల్లి రూరల్: రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్‌బాషా కోరారు. మండలంలోని పెయ్యేరు సచివాలయంలో రైతులకు గుర్తింపు సంఖ్యపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హబీబ్‌బాషా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నంబర్ అందజేసేందుకు ఫార్మర్స్ రిజిస్టరీ పోర్టల్‌లో విధిగా నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఆధార్‌కార్డుతో పాటు తమకు సంబంధించిన భూముల పాస్‌బుక్ ఆధార్ లింక్ చేసిన ఫోన్‌తో సమీపంలోని మీ సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను సంప్రదించి గుర్తింపు సంఖ్యను పొందాలని సూచించారు. దీని వల్ల రైతులకు అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేసేందుకు సాధ్యపడుతుందన్నారు. మండవల్లి ఏడీఏ జి వెంకటమణి, ఏఓ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

హాస్టల్ విద్యార్థినులకు చేయూత



గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్‌లో చదువుతున్న బీసీ హాస్టల్ విద్యార్థినులకు శుక్రవారం హాస్టల్‌లో ఏర్పాటు చేసేందుకు మూడు ఫ్యాన్లతో పాటు ఒక మిక్సీని అందజేశారు. దాత ఎస్.వి.వి.ఎస్.వి.ప్రసాద్ ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, పరంధామయ్య పాల్గొన్నారు.

నేడు శ్రీ కోదండ రామాలయ పునఃప్రతిష్ట

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేట చెక్కలమేడ వీధిలో శ్రీ కోదండ రామునికి నూతన ఆలయం ఒనగూరింది. ఈ ప్రాంతంలో 110 సంవత్సరాల చరితకల పురాతన ఆలయం స్థానంలో భక్తులు నూతన ఆలయ జీర్ణోద్ధరణ చేశారు. ఈ ఆలయం, పలువురు దేవతామూర్తుల విగ్రహాలను శనివారం ఉదయం 10.28 గంటలకు ప్రతిష్ఠించేందుకు హోమ, పూజా కార్యక్రమాలను ఇప్పటికే ప్రారంభించారు. ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించనున్నారు.